క్లుప్తంగా

వికలాంగులకు దుప్పట్ల అందజేత


వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు ఫోర్ట్ ఆధ్వర్యంలో దాత లయన్ బుచ్చన్న సహకారంతో స్థానిక కల్లూరులోని ఆదిత్య స్కూల్‌లో శుక్రవారం వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ వారు పాల్గొని ఒక్కొక్కరికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ సమాజంలోని వికలాంగులకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రామరాజ్, రత్నప్రసాద్, పవర్ వెంకటేశ్వర్లు, రమణగౌడ్, పీవీ రాజ్‌కుమార్, ఎస్కే బాషా, ఖాని పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, సీపీఎం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఊపిరితిత్తుల వ్యాధుల విభాగంలో శుక్రవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సీఐటీయూ నాయకులు సూర్యనారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామ్రేడ్ సూర్యనారాయణ సిమెంట్ ఫ్యాక్టరీలో హిందూ మజ్దూర్ యూనియన్ తరుపున కార్మికుల న్యాయమైన కోరికలు, హక్కుల కోసం పోరాడిన వ్యక్తి అని తెలిపారు. కార్యక్రమంలో పల్మనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీకాంత్, కామ్రేడ్ సూర్యనారాయణ ట్రస్ట్ చైర్మన్ కె. ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి జి. రామకృష్ణ, కోశాధికారి సాయిబాబ, సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి టి. రాముడు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల నిరసన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మునిసిపల్ కార్మికులు

కర్నూలు(సెంట్రల్) : మునిసిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికుల సమ్మెపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పెన్నులు, పుస్తకాల వితరణ


విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న ఐర్లాండ్ దేశ మహిళ పౌలా డఫ్పీ

కర్నూలు (టౌన్): స్థానిక జొహరాపురం మున్సిపల్ పాఠశాలలో ఐర్లాండ్ దేశానికి చెందిన పౌలా డఫ్పీ శుక్రవారం విద్యార్థినులకు పెన్నులు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కర్నూలుకు విచ్చేసిన ఆమె 17వ వార్డు కార్పొరేటర్ పద్మలత రెడ్డి, శౌర్య హోండా చైర్మన్ విశ్వమోహన్ రెడ్డితో కలిసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల ఇంగ్లిషులో మాట్లాడగా వారి చక్కగా సమాధానాలు ఇవ్వడంపై సంతోషం వ్యక్త చేశారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు రిడ్జ్ విద్యార్థి ఎంపిక



తౌఫిక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ గోపీనాథ్

కర్నూలు (టౌన్): ఈ నెల 6 నుంచి 8 వ తేదీ వరకు పల్నాడు పట్టణంలో నిర్వహిస్తున్న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మీపురంలోని రిడ్జ్ పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థి తౌఫిక్ ఎంపికయ్యాడు. శుక్రవారం స్థానిక పాఠశాల ప్రాంగణంలో పాఠశాల కరస్పాండెంట్ జి.గోపీనాథ్, ప్రిన్సిపాల్ రాజేంద్రన్ ఆ విద్యార్థిని అభినందించి మాట్లాడారు. అండర్–17 విభాగం రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మంచి క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

గర్భాశయంలో రాచపుండు!

మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో క్యాన్సర్ ముందు వరుసలో ఉంటుంది. ఇందులో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఒకటి. ప్రారంభంలో ఈ వ్యాధికి సంబంధించి పైకి ఎలాంటి లక్షణాలు కనిపించవు. కానీ లోలోపల అది విస్తరించి ప్రాణాలు తీస్తుంది. దురదృష్టవశాత్తూ చాలా మంది మహిళలు సరైన అవగాహన లేక, సకాలంలో గుర్తించక ఈ వ్యాధి బారిన పడుతున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి సంవత్సరం జనవరి మాసాన్ని గర్భాశయ ముఖ ద్వార అవగాహన మాసంగా నిర్వహిస్తుంది.

- పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు
- జిల్లాలో 40 వేల మందికి ఈ సమస్య
- బాల్య వివాహాలు, ధూమ, మద్యపానాలు, నెలలు నిండకముందే ప్రసవాలు కారణం
- ఆరోగ్యశ్రీలో ఉచితంగా చికిత్స
- అవగాహనే వ్యాధికి మందు
- జనవరి గర్భాశయ ముఖ ద్వార అవగాహన మాసం



కర్నూలు(హాస్పిటల్): గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను వైద్యపరిభాషలో సెర్వికల్ క్యాన్సర్ అంటారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో నాలుగో అత్యంత సాధారణ క్యాన్సర్‌గా, మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇది రెండవ అత్యంత సాధారణ క్యాన్సర్‌గా పరిగణించబడుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉండే క్యాన్సర్ వైద్యుల వద్దకు ప్రతిరోజూ 80 నుంచి 120 మంది కొత్తగా క్యాన్సర్ బాధితులు వస్తున్నారు. అలాగే ప్రతిరోజూ 15 నుంచి 20 మందికి కీమోథెరపీ, 30 మందికి రేడియోథెరపీ చేస్తున్నారు. నిత్యం 120 నుంచి 150 మంది ఇన్‌పేషంట్లు చికిత్స తీసుకుంటున్నారు. ఇందులో 20 శాతం మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సెర్వికల్ క్యాన్సర్) బాధితులున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో ఈ వ్యాధితో బాధపడుతున్న వారిసంఖ్య 40 వేల వరకు ఉంటుందని వైద్యుల అంచనా.

ఆరోగ్యశ్రీలో ఉచితంగా క్యాన్సర్‌కు చికిత్స

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్, ఒమెగా క్యాన్సర్ హాస్పిటల్, నంద్యాలలోని శాంతిరామ్ హాస్పిటల్‌లలో క్యాన్సర్ వ్యాధులకు డాక్టర్ వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్యం అందుతోంది. దీంతో పాటు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ కణతులు తొలగించేందుకు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం ఉచితంగా చేస్తున్నారు. ఈ పథకం లేనప్పుడు రోగులకు లక్షల రూపాయలు ఖర్చు అయ్యేది. అన్ని ఆసుపత్రుల్లో క్యాన్సర్‌కు ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయించుకుని డిశ్చార్జ్ అయిన రోగులకు ఆసరా పథకం కింద రోజుకు రూ.225, నెలకు రూ.5వేలు తక్కువ గాకుండా ప్రభుత్వం అందజేస్తోంది.

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎందుకు వస్తుందంటే!

ఈ క్యాన్సర్ ప్రధానంగా హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) అనే వైరస్ కారణంగా వస్తుంది. దీంతో పాటు తక్కువ వయస్సులో వివాహం చేయడం, లైంగిక సంబంధాలు కొనసాగించడం, స్త్రీ, పురుషులిద్దరిలో బహుళ లైంగిక భాగస్వాములుగా ఉండటం, ముందస్తు ప్రసవాలు, ఎక్కువ మంది పిల్లలను కనడం, ధూమపానం, మద్యపానం అలవాట్లు ఈ క్యాన్సర్ రావడానికి కారణాలుగా వైద్యులు పేర్కొంటున్నారు. ఇది ప్రధానంగా 40 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సుగల స్త్రీలను ప్రభావితం చేస్తుంది.

● ఇలా చేస్తే నివారణ సాధ్యం

ప్రపంచ ఆరోగ్య సంస్థ 2020లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికను అందించింది. దీనికింద 2030 నాటికి 90 శాతం కౌమార బాలికలకు 15 సంవత్సరాల వయస్సులోపు హెచ్‌పీవీ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలు వేయాలి. 35 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన 70శాతం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి. గర్భాశయ పూర్వ క్యాన్సర్ లేదా క్యాన్సర్‌తో బాధపడుతున్న 90 శాతం మహిళలకు తగిన చికిత్స అందించాలి. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జనవరి మాసాన్ని సర్వికల్ క్యాన్సర్ అవగాహన మాసంగా హైలెట్ చేయాలి.

వ్యాధి లక్షణాలు

- సాధారణ రుతుక్రమం గాకుండా యోని నుంచి రక్తస్రావం
- లైంగిక సంపర్కం తర్వాత రక్తస్రావం
- పీరియడ్స్ ఆగిపోయిన తర్వాత రక్తస్రావం (మెనోపాజ్)
- యోని నుంచి దుర్వాసన, రక్తంతో కూడిన గడ్డలు రావడం
- మూత్రం, మలవిసర్జనలో ఆటంకాలు

హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో అడ్డుకట్ట



సాధారణంగా వైరస్ సోకిన 10 నుంచి 15 ఏళ్ల తర్వాత క్యాన్సర్‌గా మారుతుంది. దీనివల్ల వివాహం అయిన మహిళలు ప్రతి సంవత్సరం పాప్‌స్మియర్ టెస్ట్ చేయించుకుంటే, క్యాన్సర్‌ను ప్రాథమికంగా గుర్తించగలిగితే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేసుకోవచ్చు. దీనికితోడు కౌమారదశ బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయడం వల్ల వారికి 70 నుంచి 80శాతం వరకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు.

–డాక్టర్ రాఘవేంద్రరెడ్డి, మెడికల్ ఆంకాలజిస్టు, కర్నూలు

ప్రభుత్వ ఆసుపత్రిలో అందరికీ వైద్యపరీక్షలు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజీ విభాగానికి వచ్చే ప్రతి మహిళకు లక్షణాలు ఉన్నా లేకపోయినా సర్వికల్ క్యాన్సర్ పరీక్షలు చేస్తున్నాము. ఈ పరీక్ష చాలా సులభమైంది. ఎలాంటి ఇబ్బందీ ఉండదు. 30 ఏళ్ల దాటిన ప్రతి మహిళా లక్షణాలు ఉన్నా లేకపోయినా ఈ పరీక్ష చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి వారికి చికిత్స ఇచ్చేందుకు అవకాశం ఏర్పడుతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు 2030 నాటికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కేసులు లేకుండా చేయాలి. 9 నుంచి 14 సంవత్సరాల వయస్సులో హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇస్తే ఈ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు.

–డాక్టర్ ఎ. శ్రీలక్ష్మి, గైనకాలజి హెచ్‌వోడీ, జీజీహెచ్, కర్నూలు

8న ముగ్గుల పోటీలు

కర్నూలు(సెంట్రల్): ఓల్డ్ సిటీలోని జమ్మిచెట్టు సమీపంలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఈనెల 8వ తేదీన సంక్రాంతి ముగ్గుల పోటీని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పూరి కౌశిక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.11,495 విలువ చేసే మిక్సీ, రెండో బహుమతి కింద 4700 విలువ చేసే ఫ్యాన్, మూడో బహుమతి కింద రూ. 4,395 విలువ చేసే జూసర్‌మిక్సీ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): చేతి వృత్తిదారుల సమాఖ్య రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఆవిష్కరించారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. చేనేతలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

12 షాపులకు 41 దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న మేనేజర్ చిన్నరాముడు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద నూతనంగా నిర్మించిన మున్సిపల్ షాపులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం సాయంత్రం ముగిసింది. మొత్తం 12 షాపులకు 41 మంది వ్యాపారులు దరఖాస్తులు సమర్పించారు. ఈ సందర్భంగా నగరపాలక మేనేజర్ చిన్నరాముడు మాట్లాడుతూ మొత్తం 12 షాపుల్లో రెండు షాపులు ఆప్కో చేనేత వస్త్రాలయం, ఒకటి మత్స్య వ్యాపారానికి కేటాయించినట్లు చెప్పారు. మిగిలిన వాటిని లాటరీ పద్ధతిన షాపులు కేటాయిస్తామన్నారు. ఒక సంవత్సరం పాటు కాలపరిమితి ఉంటుందని, షాపులు దక్కించుకున్న వారు ప్రతినెల రూ.8 వేలు అద్దె చెల్లించాల్సి ఉంటుందన్నారు. శనివారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో లాటరీ వేసి ఎంపిక చేస్తామన్నారు. లాటరీలో పాల్గొనే నిర్వాహకులు రూ. 1 లక్ష గుడ్‌విల్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

స్టెనోగ్రాఫర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ


స్టిక్కర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ డా.జీ సృజన

కర్నూలు(అర్బన్): జిల్లా టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర స్టిక్కర్ క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ డా.జి. సృజన ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ శంకర్‌నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. బ్రహ్మానందరెడ్డి, మల్లయ్య జిల్లా కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో భాగంగా ఆయా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, స్టెనోగ్రాఫర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినట్లు వారు తెలిపారు. తమ విన్నపంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. అసోసియేషన్ నేతలు శర్మ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, తిరుమలేశ్వరరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి కృషి చేయండి

కర్నూలు (న్యూటౌన్): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధి కోసం నిధులు విడుదల చేసి స్థలాలు కబ్జా కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని ఆవాజ్ కమిటీ నగర కార్యదర్శి ఎస్ మహమ్మద్ షరీఫ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా కోరారు. ఈ మేరకు శుక్రవారం డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీలో ఆయా సంఘాల నాయకులు పర్యటించారు. వారు మాట్లాడుతూ ముస్లిం మైనారిటీల అభివృద్ధికి, ఉర్దూ బాషాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. వర్సిటీ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్యన్, ఆవాజ్ కమిటీ నగర ఉపాధ్యక్షులు ఇలియాస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఆదోనిఅర్బన్: భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తిరుమల తిరుపతి దేవస్థానముల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రారంభమైన ధార్మిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలతో ముగిశాయి. ధార్మిక సభలో ధర్మప్రచార మండలి సభ్యులు వి.శ్రీనివాసులురెడ్డి, ఎస్.భీమిరెడ్డి మాట్లాడుతూ ధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమాలను సమాజంలోనికి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎ.వి.రమణాచార్యులు, అర్చకులు, యతిరాజాచార్యులు భక్తులకు గోవు, ధనుర్మాసం విశిష్టతలను వివరించారు. మాతా అనంతానంద గిరి ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు బసవన్నగౌడ, ఆలయ కమిటీ సభ్యులు రాముడు, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

అవీ-ఇవీ

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కృష్ణగిరి: గత నెల 15న ఆలంకొండ గ్రామంలో మాదిగ రామస్వామిని కులం పేరుతో దూషించి, దాడికి దిగాడన్న ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన బోయ మేకల సుంకన్నపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని బస్టాండులో ఓ హోటల్ వద్ద టీ తాగుతున్న రామస్వామిని నిందితుడు దూషించడంతోపాటు కాళ్లు, చేతులపై కర్రతో దాడి చేసి, చెవిని కొరికాడన్నారు. గ్రామస్తులు విడిపించడంతో ఆసుపత్రి వెళ్లి చికిత్స పొందిన అనంతరం పెద్ద మనుషుల పంచాయితీలో సైతం న్యాయం జరగకపోవడంతో పోలీసులనాశ్రయించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. శుక్రవారానికి 25వ రోజుకు చేరుకుంది. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లో తమకు జీతాలు పెంచాలని కోరుతూ అంగన్‌వాడీలు నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు సమ్మెను విరమించాలని కోరుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు నోటీసు ఇవ్వడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పేర్కొన్నారు.

కేసీకి నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు శుక్రవారం అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.719 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు

దేవనకొండ: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఆయన శుక్రవారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో ప్రజలతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో వర్గవిభేదాలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలందరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించాలన్నారు.

శనగలో పంటకోత ప్రయోగం

పాణ్యం: అనుపూరు గ్రామంలో పంట కోత ప్రయోగం చేపట్టినట్లు మండల వ్యవసాయ అధికారి జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుపూరు గ్రామంలో పంటకోత ప్రయోగం చేపట్టగా జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. గ్రామంలో 256, 307, 443, 445 సర్వే నంబర్లలో శనగ పంటలో పంట కోత ప్రయోగం చేశారు. నిర్దేశిత విస్తీర్ణంలో పంటకోత చేపట్టి దిగుబడిని లెక్కించారు. అనంతరం రైతులకు డీఏఓ పలు సూచనలు చేశారు. రైతులు భూసారం పెరిగేలా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. పశువుల పేడ, ఇతర మొక్కలను పొలంలో కలియదున్నాలని సూచించారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కార్యక్రమానికి హాజరైన పింఛన్‌దారులు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని, రామయ్య
- కల్లూరు అర్బన్ వార్డులో అట్టహాసంగా పింఛన్ల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

కల్లూరు: ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛను సొమ్ము పెంచి అవ్వాతాతలకు అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 35వ వార్డు చింతలమునినగర్‌లో 16 వార్డులకు చెందిన లబ్ధిదారులకు అట్టహాసంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరై పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రూ.3 వేలు పింఛన్ ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఒక్కటేనన్నారు. పెరిగిన పింఛన్‌తో అవ్వాతాతల మోములో చిరునవ్వు కనిపిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిని మించి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్ శభాష్ అనిపించుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో కర్నూలు, అన్నమయ్య జిల్లాల మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జ్ (కార్పొరేటర్) శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు మాధురి, అరుణ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, లక్ష్మిరెడ్డి, నారాయణరెడ్డి, నరసింహులు, కో–ఆప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్నారు



సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచారు. పెరిగిన పింఛన్ మాలాంటి పేదలకు ఆరోగ్య అవసరాలకు, మందులకు ఎంతగానో ఉపయోపడుతుంది. గతంలో పింఛన్ తీసుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్ జగన్ వచ్చాక వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీన తెల్లారకముందే తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారు.

– వన్నూరమ్మ, చింతలముని నగర్

జగనే మళ్లీ రావాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నేరవేర్చారు. పింఛన్ అర్హత వయస్సు 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించడం ద్వారా ఎంతో మందికి మేలు చేశారు. వృద్ధులు చిన్న చిన్న అవసరాలకు, మాత్రలకు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా పింఛన్ సొమ్ము ఉపయోగపడుతుంది. అవ్వాతాతల సంక్షేమ కోసం ఇంతగా తపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలి.

– పి.రామ్‌గోపాల్ శెట్టి, మాధవనగర్

కామ్రేడ్ సూర్యనారాయణకు నివాళి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కార్మిక నాయకుడిగా ఎదిగి కష్టజీవుల కోసం అహర్నిశలు కృషి చేసిన సూర్యనారాయణ ఆశయాలకు అంకితమవుదామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లోని సూర్యనారాయణ భవనంలో పి.సూర్యనారాయణ 35వ వర్ధంతి సభ న్యూసిటీ కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్టజీవుల కోసం అహర్నిశలు కృషి చేసి ప్రజల మన్నన పొందిన పి.సూర్యనారాయణను హత్య చేసిన వారిని రాజకీయంగా సమాధి చేయాలన్నారు. సీఐటీయూ, డీవైఎఫ్ఐ, రైతు సంఘం, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు. అలాగే సూర్యనారాయణ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ఊపిరితిత్తుల వార్డులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

పైప్‌లైన్ గుంతను పూడ్చేశారు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (న్యూటౌన్): నగరంలోని రైతు బజార్ నుంచి సీ క్యాంప్ క్వార్టర్స్ – శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో రెండు నెలల క్రితం పైప్‌లైన్ లీకవ్వడంతో మరమ్మతుల కోసం గుంతను తవ్వారు. పని అయిపోయిన తర్వాత గుంతను పూడ్చకుండా వదిలేయడంతో అది ప్రమాదకరంగా మారింది. దీనిపై గత డిసెంబర్ 30వ తేదీన ‘పైప్‌లైన్ గుంతను పూడ్చండి సారూ’ అనే శీర్షికతో సాక్షి ప్రచురించిన కథనంపై నగర పాలక సంస్థ అధికారులు స్పందించారు. గుంతను మట్టితో పూడిపించి చదును చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


పూడ్చేసిన గుంత

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు


గాయపడ్డ దస్తగిరమ్మను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): బైక్ చక్రంలో చీర కొంగు చిక్కుకోవడంతో జరిగిన ప్రమాదంలో వెల్దుర్తి మండలం రామళ్లకోట సెక్టార్‌లోని లింగాలపల్లె అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ (ఆయా) దస్తగిరమ్మ తీవ్ర గాయాల పాలైంది. శుక్రవారం వెల్దుర్తి మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొనేందుకు లింగాలపల్లె నుంచి దస్తగిరమ్మ బయలుదేరారు. కొండపై ఉన్న లింగాలపల్లె దిగి కాల్వబుగ్గ, వెల్దుర్తి రహదారిపై వెళ్తున్న బైక్‌ను లిఫ్ట్ అడిగి బయలుదేరారు. ఈ క్రమంలో సిద్దినగట్టు వద్ద వెళ్తుండగా వెనుక కూర్చున్న దస్తగిరమ్మ చీర కొంగు బైక్ చక్రంలోకి ఇరుక్కోవడంతో అదుపుతప్పి కిందపడింది. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.